


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## చివరి రోజులు

"**ఎవరది? విమలా?** ఇప్పుడేనా రావడం?"

పకరింపు విని తలతిప్పి చూసిన విమలకి నుదుట చెయ్యి అడ్డం పెట్టుకుని దడి మీదనించి చూస్తున్న సుబ్బులు కనిపించింది.

"అవును సుబ్బులత్తా. రాత్రి బస్సెక్కి వచ్చాను. మామ కులాసానా?" అడిగింది.

"బానే ఉన్నాడులే. నన్ను సాధిస్తా" ఆవిడ చిరుకోపంగా చెప్పింది.

విమల తమ ఇంటి చెక్క గేటుని తీసి లోపలికి వెళ్ళి మళ్ళీ తలుపు వేసి పంచలో చెప్పులు విడిచి పంపు దగ్గర కాళ్ళూ, మొహం కడుక్కుని ఏర్ బాగ్‌తో ఇంట్లోకి నడిచింది.

సుగుణమ్మ మంచం మీద పడుకుని టి.వి చూస్తోంది.

"తలుపు కూడా వేసుకోకుండా ఏంటమ్మా? అసలు రాత్రి మూసావా?" విమల తల్లి మంచంలో కూర్చుంటూ అడిగింది.

ఆవిడ తల తిప్పి కూతుర్ని చూసి విశాలంగా నవ్వింది. తర్వాత ఆమె భుజాన్ని ఆసరా చేసుకుని లేచి కూర్చుంది.

"పొద్దున తీసాలే. సుబ్బులు పాలగిన్నె లోపల పెట్టి వెళ్ళింది. మూయలేదు కాబోలు. మళ్ళీ ఒక్కదానివే వచ్చావా? అల్లుడ్ని, పిల్లని తీసుకురమ్మని చెప్పాగా?" ఆవిడ నిష్ఠూరంగా అడిగింది.

ఆ మాట వినిపించుకోనట్లుగా విమల చేతి సంచిని తీస్తూ అడిగింది.

"మొహం కడుక్కున్నావా?"

" ఆఁ పళ్ళుంటేగా తోమడానికి" సుగుణమ్మ నవ్వింది.

విమల కూడా నవ్వి సంచిలోంచి బస్టాండ్‌లో కొన్న ఇడ్లీ పాకెట్‌ని బయటకి తీసింది. దాన్ని విప్పి లోపల విస్తరాకులో ఉన్న ఇడ్లీలని చట్నీలో అద్ది తల్లికి తినిపించసాగింది.

"ఇంట్లో నెయ్యి ఉందా?" అడిగింది.

"కిందటిసారి నువ్వొచ్చినప్పుడు ఏమి వున్నాయో అవే ఉన్నాయి చూడు. కాసిని మంచినీళ్ళు కూడా పట్రా" సుగుణమ్మ చెప్పింది.

విమల లేచి వంటగదిలోకి వెళ్ళింది. దక్షతలేని ఆ గది దుమ్ముకొట్టుకుపోయి ఉంది. నెయ్యి సీసా వెదికి, చిన్న గిన్నెలోకి వంచి, వేడిచేసి తెచ్చి ఇడ్లీలమీద రాసింది. తర్వాత మళ్ళీ తల్లికి ఇడ్లీ తినిపించసాగింది. రెండు ఇడ్లీలు తిన్నాక సుగుణమ్మ మంచినీళ్ళు తాగి చాలన్నట్లుగా తల ఊపింది.

"ఇంకొక్కటి తిను. కిందటిసారికంటే ముసలమ్మవయ్యావు" కసిరి విమల మూడో ఇడ్లీ కూడా పెట్టి మంచినీళ్ళు తాగించి మూతి తుడిచింది.

"ఓ చుక్క కాఫీ ఇయ్యమ్మా" సుగుణమ్మ కోరింది.

విమల కాఫీ కలిపి తల్లికి ఓ గ్లాస్ ఇచ్చి, తనో గ్లాస్ తాగింది. ఇంటినిండా పని కనపడుతోంది. తనూ రెండు ఇడ్లీలు తిని, తల్లిని లేపి పడక్కుర్చీలో కూర్చో పెట్టింది.

"నువ్వు టి.వి చూస్తూండు. ఆకలైతే చెప్పు."

"ఇప్పుడేగా తిన్నది? సాయంత్రందాకా ఆకలి లేదు. రోకలి లేదు." సుగుణమ్మ కుర్చీలో వెనక్కివాలి టి.వి చూడసాగింది.

విమల తల్లి నవ్వారు మంచం మీది దుప్పట్లు, దిండు గలీబులు తీసి మంచాన్ని బయట ఎండలో పడేసింది. దుప్పట్లు, తల్లి బట్టల సర్ఫ్‌లో నానపెట్టింది. వంటిల్లు శుభ్రం చేసి, తర్వాత హాల్‌ని ఊడ్చి తడిగుడ్డతో తుడిచింది. కిటికీల తలుపులన్నీ తీసింది. అప్పటికి పదకొండు దాటింది.

"ఏమి పనే తల్లీ. ఆకలేస్తోంది" సుగుణమ్మ మూలిగింది.

"కాసేపాగు తల్లీ, ఇల్లంతా మట్టిగొట్టుకుపోయింది. అయిపోయిందిలే. నీళ్ళు పెట్టా నీకు తలంటిపోస్తా" విమల చెప్పింది.

"తలంటా? ఇవాళ వద్దులే నిన్నే పోసుకున్నా నీళ్ళు" ముసలావిడ అయిష్టంగా చెప్పింది.

విమల నవ్వింది.

"నిన్న తిన్నావా?"

"వెటకారమా? నాకేం వద్దుపో" సుగుణమ్మ అలిగి రిమోట్‌తో టి వి సౌండ్ పెంచింది.

విమల నవ్వుకుంటూ స్నానం చేయడానికి వెళ్ళింది. స్నానమయ్యాక తల్లి చేతికి అరిసె ఇచ్చి చెప్పింది.

"వంటయ్యేదాకా చప్పరిస్తూండు. అరగంటలో అన్నం పెడతా."

"ఈసారి వచ్చేప్పుడు గులాబ్ జాములు తీసుకురా. మెత్తగా ఉంటాయ్" ఆవిడ కోరింది.

తెచ్చానని చెపితే, ఇప్పుడే తినేసి అన్నం సరిగ్గా తినదని విమల ఏం మాట్లాడలేదు.

అన్నం వండి, ఊరు నించి తెచ్చిన కూరగాయలతో కూర, పులుసు చేసింది. సుబ్బులు ఇంటికి వెళ్ళి పెరుగు తెచ్చింది.

తల్లి పక్కన కూర్చుని మెత్తగా కలిపి అన్నం పెట్టింది. అన్నం తింటూ, టి.వి చూస్తూనే ఆవిడ అరమోడ్పు కళ్ళతో నిద్రకి తూగుతూ చెప్పింది.

"ఆ సుబ్బులు వంట అసలు బాగుండదు. ఉప్పులు, కారాలు ఉండవు. నువ్వు కమ్మగా చేస్తావు."

"ష్! విందంటే, అది కూడా పెట్టే దిక్కులేదు" విమల హెచ్చరించింది.

తర్వాత తనూ తిని, నేలమీద దుప్పటి వేసి పడుకుని నిద్రపోయింది. మూడింటికి సుగుణమ్మ లేపింది.

"అమ్మాయ్! కాసిని టీ ఇవ్వవే. కాస్త బాత్‌రూంకి కూడా తీసుకెళ్ళు" విమల లేచింది.

మళ్ళీ పనులు. పొద్దున నానపెట్టిన బట్టలు ఉతికింది. తల్లికి బజ్జీలు వండిపెట్టి, తిన్నాక రెండు గులాబ్ జామ్స్ పెట్టింది, ఆవిడ ఆనందంగా దవడలు తాటిస్తూ తిని కబుర్లు మొదలు పెట్టింది.

"ఎప్పుడూ నువ్వే వస్తావు. నాకు అల్లుడ్ని, పిల్లని కూడా చూడాలని ఉండదా? నాకొక్కటే కూతురు. నీకూ ఒక్క పిల్లే. ఎప్పుడో ఆర్నెల్ల క్రితం మొగుడితో వచ్చి ముళ్ళమీదున్నట్టుగా రెండు గంటలు ఉండిపోయింది. అల్లుడైతే మరీ నల్లపూస. ఇంతకీ రిటైరయ్యాడా? అయ్యుంటాడులే. నీకే అరవై రాలా? నీకన్నా నాలుగేళ్ళు పెద్ద."

"ఒళ్ళు స్వాధీనంలో లేకపోయినా నీ బుర్ర ఇంకా బాగానే పనిచేస్తోందమ్మోయ్" విమల నవ్వింది.

"నాకన్నీ గుర్తే. నీ పెళ్ళికి పెట్టిన ఫలహారాలతో సహా" ముసలావిడ గర్వంగా చెప్పింది.

"రిటైరయ్యాడు కాని ఇంకో ఉద్యోగంలో చేరాడు" విమల చెప్పింది.

"ఎందుకు పాపం? నాలాగా పెన్షన్ వచ్చే ఉద్యోగం కాదా?" సుగుణమ్మ సానుభూతిగా అడిగింది.

"వస్తుంది. కాని ఇంట్లో తోచక."

"ఆ మాట నిజమేలే, నాక్కూడా బొత్తిగా తోచదే విమలా. మాట్లాడదామంటే మనుషులు లేరు నమ్మ. అంతా ఆ మాయదారి టివిల ముందు కూర్చుంటారు."

"మరి నువ్వు చేసే పనేమిటో?"

"నాకైనా పొద్దుపోవాలిగా? ఎప్పుడైనా రాజరత్నం వచ్చి కూర్చుంటుంది. దానికి అన్నీ ఆరాలు. నాకెంత పింఛను వస్తుందని అడుగుతుంది. మీ నాన్నేదో కష్టపడి స్కూల్ మేస్టర్‌గా అరిచి అరిచి పాఠాలు చెప్పాడని కృతజ్ఞతగా ఇస్తున్నారు. ఎంతిస్తారో దానికి చెపితే దిష్టి కొట్టదూ? నీ వయసుకి నాకు మనవరాలు పుట్టింది. మరి అదేం మంచి వార్త చెప్పలా?"

"లేదమ్మా. ఇంకో రెండేళ్ళు ఆగుతారట."

"ఇంకా రెండేళ్ళా? నా మొహాన మునిమనవణ్ణి చూసే రాతుందో లేదో. నువ్వు దాన్ని ఒక్కసారి తీసుకొస్తే బుద్ధులు చెప్పనా? నేనంటే దానికి ప్రేమకూడా" ఆవిడ కూతుర్ని దోషిని చేసింది.

"అమ్మా. నాకూ అరవై ఏళ్ళు వచ్చాయి. నెలకోసారి ప్రయాణాలు చేయలేక పోతున్నా. నాతో వచ్చేయరాదా? మీ అల్లుడూ అదే అంటున్నాడు మాతో ఉండి, కమ్మటి వంట రోజూ తినచ్చుగా? నీకో గది, టివి, ఇంకా రోజూ గులాబ్ జాములు అన్నీ ఉంటాయి. రామ్మా" విమల ప్రాధేయపడింది.

ముసలావిడ మూలిగింది.

"నువ్వు కొడుకువైతే నీ దగ్గరే ఉండేదాన్ని. కూతురింట్లో ఉంటే ఏం శోభ? అమ్మాయ్. ఇదిగో మునిమాపు వేళ చెప్తున్నా విను. నువ్వు కూడా కూతురింటికి చుట్టం చూపుగా వెళ్ళామా, వచ్చామా అంతే. అల్లుడింట్లో ఉండకూడదు గుర్తుపెట్టుకో" సుగుణమ్మ గొంతు తగ్గించి చెప్పింది.

"కొడుకుల్లేకపోతే మరి కూతుళ్ళేగా దిక్కు? ఏదో నీ పని నువ్వు చేసుకుంటున్నావు. సుబ్బలత్త రెండు పూటలా కాఫీలు, అన్నాలు తెచ్చిపెడుతుంది. బాగానే ఉంది. నువ్వు ఈ మాత్రం కూడా లేవలేకపోతే ఎట్లా?" విమల అసహనంగా అడిగింది.

"అప్పుడు దేవుడే దిక్కు" ఆవిడ పైకి చుస్తూ చేతులు జోడించింది.

"ఆఁ దేవుడే కూతురు దగ్గరకి వెళ్ళమంటున్నాడు."

"నలుగురూ నవ్వరుటే?"

"ఎవరా నలుగురు?"

ముసలావిడ బోసి నవ్వు నవ్వింది.

"తిరగలేక నువ్వు అలసిపోతున్నావని తెలుస్తూనే ఉందే విమలా. మరేం చేద్దాం? పాశం. ఏదో రోజు 'మీ అమ్మ పోయింద'ని సుబ్బులు ఫోన్ చేస్తుంది. ఆ తర్వాత నీకీ తిరుగుడూ ఉండదు."

"ఏం మాటలమ్మా. చాల్లే ఊరుకో. నేనెళ్ళి వంటచేస్తా" విమల లేచింది.

ముసలావిడ కళ్ళల్లోంచి రెండు నీటి చుక్కలు ముడతలు పడ్డ బుగ్గల మీదకి జారాయి.

మర్నాడు విమల గదులు తుడిచి మళ్లీ గడియలు పెట్టింది. తల్లికి తలంటు పోసింది. ఆవిడకి ఇష్టమైన వంటలు చేసిపెట్టింది. తను తెచ్చిన చిరుతిళ్ళు సీసాల్లో పోసి ఆవిడ మంచం పక్కన పెట్టి చెప్పింది.

"మూతలు గట్టిగా పెట్టు. చీమలు పడతాయి."

"రెండు రోజులు ఉండచ్చుగదమ్మా" సుగుణమ్మ దీనంగా అడిగింది.

"ఆయన సంగతి నీకు తెలుసు కదమ్మా. ఇటు పుల్ల అటు పెట్టరు. అన్నీ చేతికి అందించాలి. నీ మీద అభిమానమో, చెప్పినా నేను విననానో కాని పంపిస్తున్నాడు. అది చాలు. ఈసారి పదిహేను రోజుల్లో వస్తాలే. నువ్వు ఉప్పు, కారం అనుకోకుండా పెట్టింది తిను. ఏ ఇబ్బంది ఉన్నా ఫోన్ చేయించు" విమల కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

"ఈసారి అల్లుడ్ని, పిల్లని తీసుకురా" ముసలావిడ గుర్తుచేసింది.

తల ఊపి విమల తల్లి కాళ్లకి నమస్కారం చేసి బయటకి వచ్చింది.

"వెళ్తున్నావా విమలా?" పక్కింటి సుబ్బులు అడిగింది. విమల తల ఊపి వారింట్లోకి వెళ్ళింది.

"అమ్మకి కాస్త చాదస్తం వచ్చింది అత్తా. ఏమన్నా అన్నా పట్టించుకోకు. నీ తల్లిలా అనుకో" విచారంగా చెప్పింది.

"అయ్యో! నేనేం అనుకోను విమలా. పెద్దావిడ. ఏదో గొణుక్కుంటుంది. నాకు సగం అర్థం కూడా కాదు. మీ ఆయన్ని, కూతుర్ని చూడాలని ఉందంటోందిగా ఈసారి తీసుకురా. ఉన్నంత కాలం ఉండదు" సుబ్బులు చెప్పింది.

విమల దీర్ఘంగా నిట్టూర్చింది.

"మా ఆయన సంగతి తెలిసిందేగా అత్తా, మహారాజు. అన్నీ సమయానికి అమర్చాలి. ఏది తక్కువైనా ఉగ్ర నరసింహమూర్తి అవుతాడు. కప్పెగిరి పోయేట్టు అరుస్తాడు. మా అమ్మ ఆ వీరంగం చూసిందంటే గుండాగి చస్తుంది .అదీకాక, మా అమ్మతో నేను గడిపే చివరి రోజులివి. కనీసం నెలకి ఈ రెండు రోజులైనా పూర్తిగా ఆవిడతోనే, ఆవిడ సేవలతోనే ఉండాలి – ఇలా వెళ్ళే ప్రతీసారి మళ్ళీ అమ్మని సజీవంగా చూడగలనా అనే బాధ నమిలేస్తూంటుంది. ఇక పిల్ల మా అమ్మాయి, అల్లుడు సింగపూర్ వెళ్ళిపోయారు. ఇద్దరూ అక్కడ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇంక నేనెట్లా తీసుకురాను? ఆ మాట చెపితే ఆవిడ గుండె పగిలిపోతుంది. అందుకే ఏవో సాకులు చెప్తూ వస్తున్నా. మా ఆయన ఏమన్నా సరే ఇకనుంచి పదిహేను రోజులకోసారి వస్తూంటా. బస్ టైమైంది. ఇంక వస్తా అత్తా" విమల కృతజ్ఞతగా సుబ్బులు కాళ్ళకి దణ్ణం పెట్టి, బస్టాండ్ వైపు నడిచింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments